**266వ అధ్యాయం**

## ٢٦٦ - بَابُ تَحْرِيمِ سَبِّ الْمُسْلِمِ بِغَيْرِ حَقٍّ

## అన్యాయంగా ముస్లింని దూషించటం నిషిద్ధం

قَالَ اللهُ تَعَالَى: ﴿ وَالَّذِينَ يُؤْذُونَ الْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ بِغَيْرِ مَا اكْتَسَبُوا فَقَدِ احْتَمَلُوا بُهْتَانًا وَإِثْمًا مُّبِينًا ﴾ [الأحزاب: ٥٨].

దివ్యఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

"ఏ తప్పూ చేయకపోయినా విశ్వాసులైన స్త్రీ పురుషులకు మనస్తాపం కలిగించేవారు, ఒక పెద్ద అభాండభారాన్ని, ఒక స్పష్టమైన పాప భారాన్ని తమ తలపై మోపుకున్నట్లే."

*(అల్ అహ్‌జాబ్: 58)*

١٥٦١ - وعَنِ ابنِ مَسْعُودٍ رَضِيَ اللهُ عَنْهُ قَالَ: قَالَ رَسُولُ اللهِ ﷺ: «سِبَابُ الْمُسْلِمِ فُسوقٌ، وَقِتَالُهُ كُفرٌ» متفقٌ عليه.

1561. హజ్రత్ ఇబ్నె మస్‌వూద్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: "ముస్లింని దూషించటం పాపం (దైవాజ్ఞను ఉల్లంఘించటం). అతన్ని హత్య చేయటం ధర్మతిరస్కారం (కుఫ్ర్).

*(బుఖారీ-ముస్లిం)*

*(సహీహ్ బుఖారీలోని అదబ్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)*

### ముఖ్యాంశాలు

ఒక విశ్వాసిని హత్య చేయటం పాపం రీత్యా, విశ్వాసి గౌరవోన్నతుల రీత్యా ధర్మాన్ని ధిక్కరించటంతో సమానం. అందుకే ఈ హదీసులో విశ్వాసి హత్యను కుఫ్ర్ (ధర్మతిరస్కారం)గా పేర్కొనటం జరిగింది. దీనిద్వారా ఆ పాపం ఎంత ఘోరమైనదో బోధపడుతోంది. కొంతమంది హదీసులోని పదం 'ఖితాల్'కు గొడవ పెట్టుకోవటం, పోట్లాట చేయటం అనే అర్థాలు తీసుకున్నారు. ఏమైనప్పటికీ ఈ హదీసులో ముస్లింని దూషించటం, లేక అతన్ని హత్యచేయటం లేక అతనితో పోట్లాడటం- మొదలగునవన్నీ వారించబడ్డాయి.

١٥٦٢ - وعَنْ أبي ذَرٍّ رَضِيَ اللهُ عَنْهُ أَنَّهُ سَمِعَ رَسُولَ اللهِ ﷺ يقولُ: «لَا يَرْمِي

1562. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూ జర్ర్ (రజి) తెలియజేశారు:

رَجُلٌ رَجُلاً بِالفِسْقِ أَوِ الكُفْرِ، إِلَّا ارتَدَّت عَلَيْهِ، إِنْ لَمْ يَكُنْ صَاحِبُه كذلِكَ» رواهُ البخاريُّ.

ఎవరూ ఎవరినీ పాపాత్ముడనీ లేక ధర్మ తిరస్కారి (కాఫిర్) అని నిందించరాదు. ఎందుకంటే ఎదుటి వ్యక్తి అలాంటి వాడు కాని పక్షంలో ఆ నింద తన వైపుకే తిరిగి వస్తుంది. (బుఖారీ)

(సహీహ్ ముస్లింలోని అదబ్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఈ హదీసు భావమేమిటంటే ఎవడైనా ఒక ముస్లింని ఉద్దేశ్యించి అతను పాపాత్ముడనో లేక ధర్మ తిరస్కారి అనో అన్నాడనుకోండి. ఆ ముస్లిం అలాంటి వాడు కానిపక్షంలో దేవుని దృష్టిలో తనే పాపాత్ముడిగా లేక ధర్మతిరస్కారిగా పరిగణించబడతాడు. అందుకని ఇలాంటి నిందారోపణల జోలికిపోరాదు.

١٥٦٣ ـ وعنْ أَبي هُرَيْرَةَ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «المُتَسَابَّانِ مَا قَالا فَعَلَى البَادِيُّ مِنْهُمَا حَتَّى يَعْتَدِيَ المَظْلُومُ» رواه مسلم.

1563. హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: పరస్పరం తిట్టుకునే ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు ఏమేమి అనుకుంటారో దాని పాపమంతా మొదటగా తిట్లు మొదలు పెట్టినవాని మీదే పడుతుంది-పీడితుడు హద్దుమీరి ప్రవర్తించనంత వరకు. (ముస్లిం)

(సహీహ్ ముస్లింలోని బిర్ర్ ప్రకరణం)

## ముఖ్యాంశాలు

ఒక ముస్లిం మరో ముస్లింని తిట్టి అనరాని మాటలన్నాడనుకోండి. దానికి సమాధానంగా రెండో వ్యక్తి కూడా అతన్ని తిట్టి అతనన్నట్టుగానే అన్నాడు. అంతకు మించి ఏమీ అనలేదు. అలాంటప్పుడు ఆ తిట్లపాపమంతా మొదటగా తిట్లు మొదలుపెట్టిన వానిమీదనే పడుతుంది. అయితే పీడితుడు (రెండో వ్యక్తి) గనక ప్రతీకారం చేయటంలో మితిమీరి ప్రవర్తిస్తే మాత్రం దాని ప్రకారం అతను కూడా పాపాత్ముడిగా పరిగణించబడతాడు. దీనిద్వారా బోధపడేదేమిటంటే బాధపెట్టినవారికి ప్రతీకారం చేయటం ధర్మసమ్మతమే కాని సాధారణంగా మనిషి ప్రతీకారం చేయటంలో హద్దుమీరిపోయి తానే దౌర్జన్యపరుడిగా మారతాడు. అందుకని ఉత్తమమైన పద్ధతి ఏమిటంటే మనిషి ప్రతీకారం చేసేబదులు వీలైనంతవరకు సహనం వహించి మన్నింపుల ధోరణిని అనుసరించాలి.

١٥٦٤ ـ وعنهُ قَالَ: أُتِي النَّبِيُّ ﷺ برجُلٍ قَدْ شَرِبَ قَالَ: «اضرِبُوهُ» قَالَ أَبو هُرَيْرَةَ: فَمِنَّا الضَّاربُ بيدِهِ، والضَّاربُ بنَعْلِه، والضَّاربُ بثوبهِ. فَلَمَّا انصَرَفَ، قَالَ بعضُ القَومِ: أَخزاكَ اللهُ، قَالَ: «لَا تَقُولُوا هذا، لا تعِينُوا عليْهِ الشَّيطَانَ» رواهُ البخاريُّ.

1564. హజ్రత్ అబూహురైరా (రజి)గారే చేసిన కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: దైవ ప్రవక్త (సల్లం) సన్నిధిలో ఒక తాగు బోతుని ప్రవేశపెట్టడం జరిగింది. ఆయన అతన్ని కొట్టమని ఆజ్ఞాపించారు.

(అబూహురైరా (రజి) ఇలా అంటున్నారు: దైవప్రవక్త ఆజ్ఞాపించగానే) మాలో కొందరు చేతులతో, కొందరు చెప్పులతో, కొందరు బట్టలతో అతన్ని చితకబాదారు. ఆ వ్యక్తి (దెబ్బలు తిని) తిరిగి వెళ్తుంటే ఎవరో, 'దేవుడు నిన్ను అవమానం పాలు చేయుగాక!' అని అతనికి శాపనార్థం పెట్టాడు. అది విని దైవప్రవక్త (సల్లం) "అలా అనకండి, ఇతనికి వ్యతిరేకంగా షైతాన్‌కు సహాయం చేయకండి" అని అన్నారు. *(బుఖారీ)*

*(సహీహ్ బుఖారీలోని హుదూద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1) పాపాత్మునికి శాపనార్థాలు పెడితే షైతాన్‌కు సహాయం చేసినట్లవుతుంది. ఎలాగంటే ముస్లింలను దేవుని దృష్టిలో అవమానితులుగా చేయటమే షైతాన్ అసలు ఉద్దేశ్యం. అలాంటప్పుడు ఒక ముస్లిం మరో ముస్లింను శాపనార్థాలు పెట్టడమో లేక అతను పరాభవించ బడాలనో శాపనార్థాలు పెట్టాడనుకోండి. అది షైతాన్ చేపట్టిన కార్యానికి సహాయం అందజేయటమే అవుతుంది. అందుకని పాపాత్ములకు శాపనార్థాలు పెట్టకూడదు. వారికి సద్బుద్ధి రావాలని కోరుకోవాలి.

2) ఈ హదీసు ద్వారా తాగుబోతును చితకబాదటం జరిగిందని తెలుస్తోంది. ఇది తాగుడుకు శిక్ష నిర్ణయించబడక ముందు జరిగిన సంఘటన. ఆ తర్వాత దైవప్రవక్త (సల్లం) తాగుబోతుకు నలభై కొరడా దెబ్బల శిక్ష విధించారు. కనుక ఉత్తమ విధానం ఏమిటంటే

తాగుడుకు విధించబడే శిక్షను ఒక మందలింపు చర్యగా కాకుండా ఒక దైవశిక్షగా భావించాలి. అది నలభై కొరడా దెబ్బలు. హజ్రత్ అబూబక్ర్ సిద్దీఖ్ (రజి) కూడా తన హయాంలో తాగుబోతులకు ఈ శిక్షనే విధించేవారు. అయితే రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) గారి హయాంలో ప్రజల్లో తాగుడు వ్యసనం పెరిగిపోవటం మూలంగా ఆయన దైవప్రవక్త సహచరుల్ని సంప్రదించి నలభైకు బదులు ఎనభై కొరడా దెబ్బల శిక్ష విధించారు. పరిశోధకులయిన పండితులు దీని గురించి వ్యాఖ్యానిస్తూ అసలు శిక్ష నలభై కొరడా దెబ్బలేగాని మందలింపు దృష్టితో అందులో హెచ్చుతగ్గులు చేసే అధికారం సదరు ప్రజానాయకునికి, న్యాయమూర్తికి ఉంటుందని అన్నారు. హజ్రత్ ఉమర్ (రజి) తాగుడు శిక్షలో చేసిన మార్పు కూడా మందలింపు దృష్టితో చేసిన చర్యే. అంతేగాని దేవుడు నిర్ణయించిన హద్దులో హెచ్చుతగ్గులు చేసేహక్కు, అధికారం ఎవరికీ లేదు.

١٥٦٥ ـ وعَنْهُ قَالَ: سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَقُولُ: «مَنْ قَذَفَ مَمْلُوكَهُ بِالزِّنى يُقَامُ عَلَيْهِ الحَدُّ يَوْمَ القِيَامَةِ، إِلَّا أَنْ يَكُونَ كَما قالَ» متفقٌ عليهِ.

1565. దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచిస్తుండగా తాను విన్నానని హజ్రత్ అబూహురైరా (రజి) గారే తెలియజేశారు: తన అధీనంలో ఉన్నవారిపై (దాసదాసీలపై) వ్యభిచార నింద మోపే వాడికి ప్రళయదినాన శిక్ష విధించబడుతుంది. అతని ఆరోపణలో నిజం ఉంటే మాత్రం శిక్షపడదు.

(బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని హుదూద్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని ఈమాన్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ప్రపంచంలో యజమానులు తమ అధీనంలో ఉండేవారి మీద విపరీతమైన దౌర్జన్యాలు చేస్తారు. ప్రపంచంలో వారిని అడిగేవాడు, వారి దౌర్జన్యాలకు బలౌతున్న వారికి సహాయం చేసేవాడెవడూ ఉండడు. కాని ప్రళయదినాన దేవుడు నిష్పక్షపాతంగా న్యాయం చేస్తాడు. దుర్మార్గులైన యజమానుల అకృత్యాలకు బలవుతూ ఉండిన పీడిత వర్గానికి కూడా ఆ రోజున న్యాయం చేకూరుతుంది. అలాగే ప్రపంచంలో శిక్ష నుంచి తప్పించుకుంటున్న యజమానులు కూడా ఆ రోజు శిక్షననుభవిస్తారు. హదీసులో తమ అధీనంలో నున్నవారిపై వ్యభిచార నిందమోపేవారికి ప్రళయదినాన శిక్ష విధించబడుతుందని చెప్పటంలోని ఆంతర్యం అదే. అధికార గర్వంతో బానిసల మీద, తమ కింద పనిచేసేవారిమీద దుర్మార్గానికి ఒడిగట్టేవారిని ఈ హదీసు హెచ్చరిస్తోంది.